కథానిక:

మనసున మల్లెలు

శ్రీ కె. ఎస్. వి.

"ఫ్లవర్ వేజెస్ కావాలి" అంది సునీత

"ఆఫీసుకెళ్ళి కార్ పంపిస్తాను—వెళ్ళి తెచ్చుకో—" అన్నాడు శంకరం బ్రైనాట్ సర్ది అద్దంలో చూసుకుంటూ.

"సాయంత్రం ఇద్దరం వెళ్తే ..."

"సాయంత్రం సంగతి సాయంత్రం. ఎందరాకే తెమ ల్తుందో లేదో తెలీదు ఆఫీసులో అంతా కొత్త కదూ"

"లేడీ స్టెనోగ్రాఫర్లున్నారు కాబోలు."

"నా ప్రియమైన సునీత! నువ్వా ఆడపిల్లవేకదూ మరి"

సునీత నవ్వింది "సాయంత్రం సాధ్యమైనంత తొందరగా వొచ్చేయ్యండి."

"ఓకే"

"థేంక్యూ!"

* *

ట్రాన్స్‌ఫర్ మీద అవూరొచ్చి సరిగా ఇది నాలుగో రోజు శంకరానికి ఆఫీసులో అంతా కొత్త

కొత్తగా దిగిన ఇంట్లో సునీతకూ కొత్తే!

కాని, సునీతకు వూరు కొత్తేం కాదు ఆరున్నర సంవత్సరాల క్రితం ఇక్కడే డిగ్రీ చదివింది

* * *

"గాంధీరోడ్‌కి పోనీ." అంది సునీత డ్రైవర్‌తో కారు పరుగెడుతోంది

నిన్నటి దినం కూడా ఇలాగే కార్లో వొచ్చింది సునీత డోర్ కర్టెన్ల కోసం

బజారువెంట కారుదిగి నడుస్తూంటే చప్పున ఆదిమూర్తి గుర్తొచ్చేడు

ఎన్ని సాయంత్రాలు అతనో కలిసి ఆ ఫుట్‌పాత్ మీద నడిచింది తను!

కార్ ఆపేడు డ్రైవర్, హోటెల్ భీమాస్ దగ్గర.

"ముందుకు వెళ్ళమంటారా అమ్మగారూ?... వన్‌వే అంటున్నాడు పోలీసాయన ఎలాగ?"

"వద్దులే దిగి నడుద్దాం..."

కారు దిగింది

హోటేల్ భీమాస్ ఎదురుగా హోటేల్ డీలక్స్! తలిక్కు పడింది

డీలక్స్‌లోనే కదూ మొదటిసారిగా తను ఆదిమూర్తితో టీ తాగింది "ఈ వూరంతటికీ టీ ఇక్కడే బాగుంటుంది" అన్నాడు.

టీ తర్వాత చార్మినార్ సిగరెట్ ముట్టించేడు.

ఘాటు వాసన

ఆదిమూర్తి దగ్గరెప్పుడూ ఆ వాసనే

"ఇక్కడెక్కడా ఫ్యాన్సీషాప్స్ లేవమ్మగారూ!"

"ముందు కెళదాం"

నడుస్తోంది సునీత

వెనకగా అనుసరిస్తూ డ్రైవర్

'హైకో ఫ్యాబ్రిక్' లో ఎర్రంచు తెల్ల చీరలు వ్రేళ్ళాడుతున్నాయి

["నీకు నల్లంచు తెల్లచీర బాగుంటుంది"

"కాదు—ఎర్రంచే"

"కాదు - నల్లంచే"

"సరే—నీ ఇష్టం"]

తన బర్త్‌డేకి చీర ప్రెజెంట్ చేసేడు ఆదిమూర్తి ఈ షాప్‌లోనే కొన్నది!

[ఆ మరుసటి దినం—బర్త్‌డే నాడు

"నిజం—నీకు ఎర్రంచు తెల్లచీర కూడా బాగుంటుంది!]

"ఫ్లవర్ వేజ్‌లిక్కడుంటాయమ్మగారూ!.."

ఫ్యాన్సీషాప్ దాటివెళ్ళిపోయిన సునీత డ్రైవర్ మాటతో ఆగి వెనక్కొచ్చింది

షాపతను సాదరంగా ఆహ్వానించేడు. రకరకాల ఫ్లవర్ వేజెస్ చూపిస్తున్నాడు.

షాపంతా కలయ జూస్తోంది సునీత.

గాజు వస్తువులు చాలా వున్నాయి.

వాటిలోంచి ఏవోచూపులుతొంగిచూస్తున్నాయిహృదయంలోకి.

కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది సునీతకి.

రెండు ఫ్లవర్ వేజెస్ తీసుకుంది.

"ఫ్లవర్స్ చూడండి. ." అంటూ ప్లాస్టిక్ పువ్వుల కట్ట వొకటి ముందుంచేడు షాపతను.

["సివిలైజ్డ్ లైఫ్‌లో ఈస్తటిక్ సెన్స్ దిగజారడానికి నిదర్శనం ప్లాస్టిక్‌పూలు ఏమంటావు సునీ...ప్లాస్టిక్ పువ్వులు తయారుచేసేవాళ్ళని, అమ్మేవాళ్ళని, కొనేవాళ్ళని, వాటినిచూసి ఆనందించేవాళ్ళని ... అందర్నీ షూట్‌చేసి పారెయ్యాలి... ఐ హేట్ దెమ్ !......]

"పెద్ద పెద్ద పువ్వులు కూడా వున్నాయండీ .." అంటూ ఇంకో కట్ట ముందు పెట్టేడు షాపతను.

"ఏవీ వొద్దు–" అంది కరుగ్గా సునీత.

చిన్నబోయినా, పైకి నవ్వుతూ–"ఇంకేమైనా కావాలాండీ–" అన్నాడతను.

"నో థేంక్స్–"

ఫ్లవర్ వేజెస్‌తో కార్లో కూచుంది సునీత.

"ఇంటికేనా అమ్మగారూ ?..."

"వూఁ..."

టవర్‌క్లాక్ దగ్గర పడుతూండగా సునీత మనస్సులో కొత్త వూహ మెదిలింది.

"వొద్దు–ఇటు–రైట్‌కి తిప్పు..."

గోవిందరాజస్వామి గుడిగోపురం ఎత్తుగా గంభీరంగా వుంది

[గుళ్ళూ గోపురాలూ చాలా అందంగా వుంటాయి . కాని; దేవుడంటే మాత్రం . వూఁహుఁ నాకు నమ్మకం లేదు..."

"పోనీలెండి దేవుడికి మాత్రం మనుషుల మీద నమ్మకం వుంటుంది... ..."

"నాన్సెన్స్! సునీ!. అది నీలాంటి వాళ్ళు కల్పించే అందమైన భ్రమ. దేవుణ్ణి చంపేస్తే.. పూర్తిగా చంపేస్తే. మరుసటి దినం ప్రొద్దునకల్లా ప్రపంచం పూర్తిగా బాగుపడిపోతుంది..... ."]

అంతా ఆవేశమే అదిమూర్తికి.

పోలీస్‌స్టేషన్ సమీపిస్తోంది కార్.

"యూనివర్శిటీకి పోనీ..." అంది సునీత, అనుకోకుండానే.

కొద్దిగా ఆశ్చర్యపోయేడు డ్రైవర్, సీట్లో సర్దుక్కూచుని గేర్ మార్చి వేగం హెచ్చించేడు.

ఆరు సంవత్సరాలపైనే అయింది కదూ తను కాలేజీ వదిలిపెట్టి ! ఆ తర్వాతెప్పుడూ ఇటుకేసి రానేలేదు.

అంతా చాలా మారిపోయింది.

యూనివర్శిటీకెళ్లే దారిలోనే చాలా చాలా మార్పులు జరిగేయి. పాతచెట్లు కూలిపోయేయి. వాటి స్థానంలో కొత్త భవనాలు లేచేయి.

బాలజీకాలనీదగ్గర మునుపున్న మర్రిచెట్టిప్పుడులేదు ఆ చెట్టు వూడలు సాయంత్రాలు ఎంతచక్కగా వూగుతుండేవి ! అదిమూర్తీ తనూ కలిసి యూనివర్శిటీ నుంచి వస్తూంటే–"రండి–రండి–టౌన్‌లోకి ఇదే స్వాగతం ! " అని ఆహ్వానించేట్టు వూగేవి !

తీరా యూనివర్శిటీ కేంపస్‌లోకి వెళ్లేసరికి కొత్త ప్రపంచంలోకే ప్రవేశించినట్టనిపించింది సునీతకు

కారాపించి, దిగి నడవడం మొదలెట్టింది.

లైబ్రరీదాకా నడిచింది.

ఆ దారి పొడుగునా ఏవేవో పాతవిగ్రహాలను కొత్తగా ప్రతిష్టించేరు

కళ్ళు తిరిగినట్టయింది.

వినాయక విగ్రహం అరుగుమీద చతికిల పడింది.

లైబ్రరీగేటు పక్కగా ఉన్న చెట్టుకింద అదిమూర్తి నిలుచుని నవ్వినట్టయింది.

లేడీస్ హాస్టల్ నుంచి తన రాకకోసం అతనెన్నిసార్లు అక్కడ కని పెట్టుకు నిలబడాడు !

ఏమయ్యేడు అదిమూర్తి ?

కారు తీసుకొస్తేడు డ్రైవర్.

తను అలిసిన సంగతి గ్రహించేడు.

ఎక్కి కూర్చుంది

"అదిగో–అటు తిరుగు–కేంటీన్ వొస్తుంది. ...."

ఆశ్చర్యం !

కేంటీన్ ఇవతల ఇంతకుముందు బీడుగావున్న జాగాలో బ్రహ్మాండమైన బిల్డింగ్ కడుతున్నారు, నత్తగుల్ల ఆకారంలో నున్న పెద్ద బిల్డింగ్

అధునాతనమైన ఆడిటోరియం అని చూడగానే తెలుస్తోంది.

ఆరేళ్ళ క్రితం ఆ పరిసరాల్లో తచ్చాడుతూ అదిమూర్తీ తనూ ఎన్ని కబుర్లు చెప్పుకున్నారో ! !

ఏదీ ఆదిమూర్తి ? ఏమయ్యేడు ?

"కాఫీ తాగుతారా అమ్మగారూ ?..."

"వూహూఁ...వొద్దు..." వాచీ చూసుకుంది సునీత.

"ఇంటికెళ్ళిపోదాం..."

కారు కదిలింది.

విశ్రాంతిగా సీటుకి జేరగిలబడింది సునీత.

కాని లోపల అశాంతి.

ప్రేమించాననలేదు ఆదిమూర్తి. తనూ అనలేదు. కాని ఇద్దరికీ తెలుసు. ఒకరంటే ఒకరికిష్టమని.

బైటపడని ప్రేమ.

కాని అర్థమైంది.

ఏం లాభం ?

అంతా ఆవేశం ఆదిమూర్తికి.

వాళ్ళ నాన్నతో ఏదో దెబ్బలాట. "నన్ను మరచిపో-" అని తనకో వుత్తరం, బస్, అంతే !

పలకరిగినట్టు మాయమైపోయేడు ఆదిమూర్తి.

ఏదో రైలు ప్రమాదంలో చనిపోయేడన్నారు కొందరు కాదు మిలిటరీలో చేరేడని—కాశ్మీర్ వెళ్ళిపోయేడని-బర్మాలో స్థిరపడిపోయేడని...రకరకాల వదంతులు.

ఏదీ ఖచ్చితంగా తెలీదు.

అసలు బ్రతికున్నాడా ఆదిమూర్తి ?

తనకు సలహా ఇచ్చినంత సులభంగా అతనూ తనని మరచిపోయేడా ?...

డోర్ తెరిచి పట్టుకున్నాడు డ్రైవర్.

దిగింది సునీత.

★ ★ ★

"జీడిపప్పులేని ఉప్మా—ప్రేమలేని సంసారంలా రసహీనంగా వుంటుందోయ్...అఁ. చాలు...చాలు.." అంటూ ఇంకా ఉప్మా వొడ్డిస్తున్న సునీతను వారించేడు శంకరం

"పోనీ వుట్టి జీడిపప్పు-" అంటూ ప్లేటులోనేరి వేస్తోంది సునీత

ఉల్లాసంగా ఉన్నాడు శంకరం.

అనుకోకుండా ఆఫీసులో పని తొందరగా తెమిలింది. రెక్కలు గట్టుకుని ఇంటికొచ్చేడు.

"తొందరగా రెడీ అవుతే—టౌనంతా వో రవుండేసొద్దాం..." అన్నాడు శంకరం. వాచీ చూసుకున్నాడు "ఆరవుతోంది... పోనీ... ఏదైనా సినిమా కెల్దామా ?... ఈ వూళ్లో థియేటర్లెలా వుంటాయో !......"

ఇద్దరూ కార్లో కూచునే సరికి ఆరుంబావు.

శంకరం డ్రైవ్ చేస్తున్నాడు. "ఏటెళ్దాం ?"

"మీ యిష్టం..."

"నీ ఇష్టం చెబ్దూ..."

సీరియస్‌గా భర్తవేపు చూసి ఉన్నట్టుండి ముక్కొగరేసి వెక్కిరించింది సునీత "వెవ్వే..." అంది.

పక్కున నవ్వొచ్చింది శంకరానికి. వోచేత్తో సునీత తలపట్టుకుని వూపుతూ "-పిచ్చి-" అన్నాడు.

"రోడ్డుమీద మీకిదేం పిచ్చి ?—" అంటూ భర్త చెయ్యి తీసి స్టీరింగ్ మీద పెట్టింది సునీత. "ఇంకా నయం ... ఆక్సిడెంటయేది..." అంది.

ఇంతలో ...

ఆక్సిడెంటే అయినట్టు 'కెవ్వు' మంది సునీత.

"ఏమయింది ?..." అన్నాడు శంకరం, బ్రేక్‌పెడల్ తొక్కి.

కిళ్ళీబడ్డీదగ్గరున్న సినిమా పోస్టర్ని చూపిస్తూ "మల్లీశ్వరి" అంది సునీత.

ఇద్దరూ హాల్లోకొచ్చేసరికి అప్పటికే సినిమా బిగినైంది.

"నేనీ సినిమా ఇంతకుముందు చూసేను—"అన్నాడు శంకరం.

"నేనూను—" అంది సునీత, సీట్లో సర్దుకుని కూచుంటూ. "నేను నాలుగుసార్లు చూసేను" అంది మళ్ళీ. [బాగా గుర్తుంది ఆదిమూర్తితో కలిసి మ్యాట్నీ చూడడం. "మనసున మల్లెలు" పాట వింటూ ఆదిమూర్తి ఏడ్చేడు. ఎందుకని ?]

శంకరం సినిమాలో లీనమైపోయేడు.

పాత సినిమా.

ఇంకా కొత్తగా వుంది. ఇప్పటికీ!

కాలం వొక్కసారిగా వెనక్కి తిరిగినట్టయింది సునీతకి.

వాసన, ఏదో వాసన, పరిచితం.

చార్మినార్ సిగరెట్ వాసన, ఘాటు.

ఆదిమూర్తి దగ్గర అదే వాసన.

ముందు సీట్లో ఎవరో దగ్గుతున్నారు.

నిదానించి చూసింది సునీత.

ఉలిక్కిపడింది.

రింగురింగుల క్రాపు, చదరపుతల, నిడుపాటి చెవులు. అదిగో వాసన. ఆదిమూర్తి.

ఆదిమూర్తే కాదుగదా!

"బలేవుంది కదూ?..." అన్నాడు శంకరం.

తెరమీద రెండెడ్ల బండి.

"ఊరును చేరాలి..." పాట.

భానుమతి నవ్వులో — గొంతులో — చూపులో .....ఎంత ముగ్ధత్వం! ....

సునీత మనసు వూగిపోతోంది

ముందుసీట్లో అతను ఆదిమూర్తేనేమో!

ఆదిమూర్తే అయితే! ..చూస్తాడా తనని, గుర్తిస్తాడా? నవ్వుతాడా? పలకరిస్తాడా? ఏమంటాడు? చూడనట్టు వెళ్ళిపోతాడేమో?! వెళ్ళిపోతే?. వూహూ

ఆదిమూర్తే కాడేమో! . ఇంకెక్కడ ఆదిమూర్తి!...వెళ్ళిపోయిన హీరో ఆఖర పేజీలో తిరిగిరావడం—నవలలోనే!

ఇది జీవితం!......

"అంతలో పరధ్యానమా?..." అంటున్నాడు శంకరం.

ఇంటర్వెల్.

లైట్లెప్పుడు వెలిగేయో!

ముందుసీటతను—ఏడీ – లేచి వెళ్ళిపోయేడే!

కాలం మారిపోవడం గురించి మాట్లాడుతున్నాడు శంకరం. కాలం మారుతుంది. దుస్తులు మారిపోతాయి టేస్ట్ మారిపోతుంది. సివిలిజేషన్ మారిపోతుంది. అయితే వీటన్నిటిమధ్యా—మారని దొకటుంది. ఏమిటది?

ఏమిటో చెప్పడం లేదు శంకరం. అసంబద్ధంగా మాట్లాడుతున్నాడు.

కొంచెం చిరాకనిపించింది సునీతకి. "ప్చ్!"— అంది.

సినిమా మళ్ళీ మొదలైంది.

చీకట్లో తడుముకుంటూ వొచ్చి కూచున్నాడు ఎదుటి సీటతను.

నడక—ఆ నడక—ఆదిమూర్తేనా ?

ముఖం కనిపిసే బాగుణ్ను.

దగ్గుతున్నాడు

మళ్ళీ అదే వాసన.

బయట సిగిరెట్ తాగి వచ్చాడేమో!

ఆదిమూర్తే!...సందేహం లేదు!!

ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి మళ్ళీ ఆదిమూర్తి!

"ఆదిమూర్తీ"— అని పిలిస్తే?—పలకరిస్తే?

శంకరం ఏమనుకుంటాడు? ఏమంటాడు?

చుట్టూ జనం వొకర్తొ వొకరు ఏమనుకుంటారు?

చుట్టూ జనం తమలో తాము ఏమనుకుంటారు?

—ఇంతకీ—ముందుసీటతను ఆదిమూర్తి కాకపోతే?

—గుడ్ గాడ్—

ఇన్సల్ట్ కదూ?

గుండెబరువైపోయింది సునీతకి.

అంతలో—తెరమీద—

స్వప్నపు టింద్ర జాలంలా పాట మొదలైంది—

"మనసున మల్లెల మాలలూగెనే...

కన్నుల వెన్నెల డోలలూగెనే..."

తెరమీద దృశ్యం. నలుపు—తెలుపు, అలల నిగనిగ.

మల్లీశ్వరి కన్నుల్లో కోటి పౌర్ణిమల కాంతి.

"అలలు కొలనులో!

గలగల మనినా..."

పాట సునీతగుండెలో స్మృతులకు రెక్కలిచ్చి విగురవేస్తోంది.

అంతలో—

"గడియయేని నను విడచిపోకుమా

ఎగసిన హృదయము పగులనీకుమా..."

కలుక్కుమంది గుండెలో

ఎగసిన హృదయం పగులగొట్టిందెవరు?......

ముందుసీటతను దగ్గుతున్నాడు.

—వొక్కసారిగా ఈ లోకంలో కొచ్చిపడింది సునీత.

తెలిసే తెలీదు—చెంపలు తడిసిపోయేయి—

ఏడుపు.

కన్నీరు.

ఎందుకెందుకు?

రోదసిలో పడేసినట్టు ఆదిమధ్యాంత రహితంగా వుండిపోయింది సునీత

'రెండోసినిమా క్కూడా వుండిపోదామా ?... అంటున్నాడు శంకరం.

ఉలిక్కిపడి చూసింది సునీత.

ఏడీ బండుసేటతను? లేడు.

అసలు హాలంతా ఖాళీ

ఐతే-ఇంతకీ అతను ఆదిమూర్తేనా?

అయ్యో! మొఖం చూసివున్నా బాగుండేది.

థియేటర్ గేట్ దాటేక కార్ స్పీడ్ పెంచుతూ-"మూగీగ వున్నావేమిటోయ్ ..మల్లీశ్వరి కధ సుఖాంతమే .." అన్నాడు శంకరం.

ఫుట్ పాత్ వెంట పరుగెడుతున్నాయి సునీత కళ్ళు.

చాలాదూరం వొచ్చేసేక ఇహ ఆశవొదులుకుంది.

ఆదిమూర్తేనా? అవునేమో! అయితే? ..

ఆదిమూర్తి కాదేమో! కాకపోతే.

ఆలోచనలో కొంచెం విసుగెత్తింది సునీతకి.

"పరధ్యానమా?..." అంటున్నాడు శంకరం.

"ఊఁ. ." అంది పరధ్యానంగా. అంతలో తేరుకుంది. "ఊఁహూఁ..."

పదిన్నర దాటేక బాల్కనీలో వాలుకుర్చీలో నిశ్శాంతిగా కూచుని 'ఇవాళ వెన్నెలుంటే బావుండునోయ్ '' అన్నాడు శంకరం.

తమలపాకు చిలకలు చుడుతూ ఏమీ అనలేదు సునీత.

"మబ్బుగావుంది-వానొస్తుందేమో!..." అన్నాడు శంకరం. ఆకాశంలోకి తలెత్తి చూసేడు.

అతని వాలకం వింతగా వుంది.

సునీత మనసింకా సినిమా అనుభూతితో నిండుగా వుంది. దుప్పటి కప్పుకుని కలలు కనాలనుంది. కొంగు భుజాల చుట్టూ కప్పుకుని తమలపాకుల పళ్ళెం లోపలికి తీసికెళ్తూ- "నేను పడుకుంటాను-" అంది.

శంకరం ఆ మాట విన్నట్టే లేదు "ఊఁ హూఁ. హూఁ.. ఊఁ. హూఁ హూఁ..."అంటూ కూనిరాగంతీస్తూ మధ్యలో ఆగి- "మల్లీశ్వరి కధ సుఖాంతమే గాని అందులో ఎంతవిషాదముంది!..." అన్నాడు.

సునీత వినాలని అన్నాడుగాని, సునీత అక్కడలేదని గమనించలేదు శంకరం.

గదిలో తెల్లటి మల్లెపూవులాంటి పరుపుమీద పడుకుని దుప్పటి కప్పుకోబోతోంది సునీత క్షణం ఆగి మసక వెల్తురులో బాల్కనీలోవున్న శంకరంవేపు చూసింది.

శంకరం గొంతు బాగుండదు పాడడం రాదతనికి అయినా- ఆ రాత్రి నిశ్శబ్దంలో ఆ చీకట్లో వొంటరి బాల్కనీలో తనకు తాను వినిపించుకుంటున్నట్లు...

"మనసున మల్లెల మాలలూగెనే
కన్నుల వెన్నెల డోలలూగెనే .."

అని గొంతెత్తి వెర్రిగా పాడుతున్నాడు శంకరం-

చీకటి గదిలోంచి మసక వెలుగుల బాల్కనీలోని ఆ దృశ్యం చూసి ఆ పాటవిని నిలువునా జలదరించిపోయింది సునీత.

ఉలిక్కిపడింది.

మనసులో తళుక్కున మెరుపు.

శంకరం గొంతులో ఎంత స్వచ్ఛత! ఎంత సహజత్వం!!

తన మనసులో ఆదిమూర్తి జ్ఞాపకాల మల్లెలు!

మరి

శంకరం మనసులో ఏ మల్లెలున్నాయో!!.........